సాక్షి

మెదక్

ఆదివారం । 9 । మార్చి । 2025



నువ్వులు.. లాభాల సిరులు

వేసవిలో ఆరుతడి కింద సాగు చేసే నువ్వుల పంట సిరులను కురిపిస్తుంది.

వివరాలు 8లో ▸



స్పేస్ సెంటర్ సందర్శన

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రీహరి కోట స్పేస్ సెంటర్‌ను సందర్శించారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆదివారం	సోమవారం
సా. 6.30 గం.	ఉ. 5.06 గం.

న్యూస్‌రీల్

ఇది పట్టభద్రుల విజయం



మున్సిపల్ సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

నర్సాపూర్: తన విజయం పట్టభద్రులకు అంకితమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ మున్సిపల్ మహిళా ఉద్యోగులకు చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేస్తానని చెప్పారు. చీరల పంపిణీ అభినందనీయమని కొనియాడారు. అనంతరం మురళీయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిని సన్మానించారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ ఇంజినీర్ బాలస్వామి

అల్లాదుర్గం(మెదక్): వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి తెలిపారు. శనివారం మండలంలోని గడిపెద్దాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు, వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో మెదక్ విద్యుత్ శాఖ ఎస్ఈ శంకర్, డీఈ చాంద్‌పాషా, ఏడీ మోహన్‌బాబు, పాపన్నపేట ఏడీ శ్రీనివాస్, రేగోడ్ ఏఈ యాసిన్‌అలీ, అల్లాదుర్గం ఇన్‌చార్జి ఏఈ నవాజ్ పాల్గొన్నారు.

రూ. 35 లక్షలతో కొత్త విద్యుత్ లైన్

పాపన్నపేట(మెదక్): మండలంలోని విద్యుత్ సమస్యలు తీర్చేందుకు రూ. 35 లక్షలతో విద్యుత్ లైన్ వేస్తున్నట్లు చీఫ్ ఇంజినీర్ బాలస్వామి తెలిపారు. పొడ్చన్‌పల్లి ఫీడర్‌లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా ఉపకేంద్రంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ సమస్య తీర్చడానికి రూ. 35 లక్షలతో కొడిపల్లి నుంచి 33 కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం పాపన్నపేట మండలంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న హరీశ్‌రావు

నర్సాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సునీతారెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం నర్సాపూర్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు.

కార్మికులకు ‘ఎంఆర్‌ఎఫ్’ షాక్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ‘2021 మార్చి 29న ఏడాది పాటు శిక్షణ కోసం మిమ్మల్ని తీసుకున్నాం. ఆ కాలంలో మీరు పని నేర్చుకోలేదు. పరిశ్రమలో నెలకొన్న ఆర్థిక మాద్యం నేపథ్యంలో మిమ్మల్ని తొలగిస్తున్నాం. దేశంలోని ఇతర ప్లాంట్లలో అవసరమున్న చోట పని చేయడానికి ఆసక్తి ఉంటే వారం రోజుల్లో అభిప్రాయం తెలపండి’ అని మండలంలోని అంకేనపల్లి శివారులో గల ఎంఆర్‌ఎఫ్ (ఏపీఎల్) ప్లాంట్లో పనిచేస్తున్న 350 మందికిపైగా కార్మికులకు యాజమాన్యం ఈనెల 7న నోటీసులు అందజేసింది. దీంతో వారి భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. దిక్కుతోచని స్థితిలో కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు. రిక్రూట్‌మెంట్ సమయంలో చేసుకున్న ఒప్పందం మేరకు పర్మనెంట్ చేయాలని కోరిన పాపానికి ఉద్యోగంలో నుంచి తీసేసి పరిశ్రమ యాజమాన్యం నియంతృత్వం ప్రదర్శిస్తుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా కార్మికులు న్యాయ పోరాటానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం.

ప‘రేషన్’..!

నిండుకున్న బియ్యం నిల్వలు

- తెరుచుకోని రేషన్ దుకాణాలు
- జిల్లాలో 2,13,777 కార్డుదారులు
- 6,85,178 మంది లబ్ధిదారులు
- కావాల్సిన బియ్యం 35 వేల క్వింటాళ్లు



రంగంపేటలో తెరుచుకోని రేషన్ దుకాణం

మెదక్ కలెక్టరేట్: ప్రతీ నెల 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు బియ్యం అందించాల్సి ఉంటుంది. అయితే 8 రోజులు గడుస్తున్నా ఇంకా పంపిణీ చేయడం లేదు. పేదలు రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతుండగా, డీలర్లు గోదాముల వద్ద పడిగాపులు గాస్తున్నారు. అయితే బియ్యం నిల్వలు లేకపోవడంతో అధికారులు గోదాములు తెరవడం లేదని సమాచారం. ప్రతి నెల 20వ తేదీ నుంచి 30 వరకు మండల స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా జరుగుతుంది. వచ్చిన బియ్యాన్ని డీలర్లు ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేస్తారు. కాని మూడు నెలలుగా బియ్యం సరఫరాల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

జిల్లావ్యాప్తంగా 522 రేషన్ షాపులు

జిల్లాలోని మెదక్, రామాయంపేట, పాపన్నపేట, చేగుంట, తూప్రాన్, నర్సాపూర్, పెద్దశంకరంపేటలో మండలస్థాయి స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వీటి నుంచి జిల్లాలోని 21 మండలాల్లో గల రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం వీటిలో ఏ ఒక్కదానిలో బియ్యం నిల్వలు లేనట్లు సమాచారం. జిల్లాలో మొత్తం 522 రేషన్ దుకాణాలు ఉండగా, 2,13,777 కార్డులు (కొత్తవి కాకుండా), 6,85,178 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెల 35 వేల క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది.

పట్టణ దుకాణాలకు సరఫరా

పట్టణ ప్రజలు ఆందోళనలకు దిగుతారనే ఉద్దేశంతో ఉన్న కొద్దిపాటి నిల్వలు పట్టణంలోని 120 దుకాణాలకు సరఫరా చేసినట్లు సమాచారం. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ దుకాణాలకు సరఫరా చేసేందుకు గోదాముల్లో బియ్యం నిల్వలు కరువయ్యాయి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే గాని గోదాములకు, అక్కడి నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా జరుగుతుంది. అయితే ఇప్పటికే వారం గడిచిపోయింది. అసలు బియ్యం సరఫరా చేస్తారా? లేదా అని ఇప్పటికే గ్రామాల్లో ఆందోళన మొదలైంది.

ఇంకెప్పుడిస్తారు?



గతంలో ప్రతి నెల 1వ తేదీన బియ్యం వచ్చేవి. రెండు నెలలుగా సకాలంలో ఇస్తలేరు. ఇప్పటికే వారం గడిచిపోయింది. డీలర్‌ను అడిగితే గోదాం నుంచి బియ్యం రాలేవని చెబుతున్నాడు. ఇంట్లో బియ్యం లేవు. బయట కొందామంటే ధరలు మండిపోతున్నాయి. బతికేదెట్లా?

– వెంకయ్య, వై. మాందాపూర్, కొల్చారం

రెండు, మూడు రోజుల్లో సరఫరా

బియ్యం సరఫరాకు ఆర్డర్ కాపీ వచ్చింది. రెండు, మూడు రోజుల్లో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తాం. ఉగాది నుంచి సన్న బియ్యం ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. సన్న బియ్యం వచ్చాక దొడ్డు బియ్యం వృథా అవుతాయని గోదాముల్లో స్టాక్ ఉంచడం లేదు. దీంతో బియ్యం సరఫరా ఆలస్యమవుతోంది.

– జగదీష్, జిల్లా సివిల్ సప్లై మేనేజర్



షెడ్డులోని కుండలపై వివిధ రకాల పక్షులు


సండే స్పెషల్

పర్యావరణ హితుడు
పక్షి ప్రేమికుడు

రకరకాల పక్షులు పెంచుతున్న మల్లాగౌడ్

- రూ.వేలు ఖర్చు చేసి ఇష్టంతో కొనుగోలు
- కాక్ టెల్ చిలుక, లవ్ బర్డ్స్, కానులు, పావురాలు, పందెంకోళ్లు
- ఇంటి వద్ద చిన్న చిన్న జాలీలతో షెడ్స్ ఏర్పాటు
- దాణా కోసం ప్రతి నెలా రూ. వేలల్లో ఖర్చు
- హైదరాబాద్ నుంచి సరఫరా

అతడికి పక్షులంటే ప్రాణం.. ఇష్టంతో రూ. వేలు ఖర్చు చేసి పక్షులను కొనుగోలు చేసి ప్రాణంగా పెంచుతున్నాడు. వృత్తి వ్యవసాయం, ఉద్యోగం లైన్‌మెన్.. అయినా ఉదయం, సాయంత్రం పక్షులతోనే గడుపుతాడు. వాటి దాణా కోసం ప్రతి నెలా వేలు ఖర్చు చేస్తూ పక్షి ప్రేమికుడిగా మారాడు కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మల్లాగౌడ్.



8లో

– బొడ్డు పెంటయ్య, కౌడిపల్లి(నర్సాపూర్)

మెరుగైన వైద్యం అందించండి

కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆస్పత్రిలో మందులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం(నర్సాపూర్): నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం మండలంలోని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలు, వివరాలపై ఆరా తీశారు. ఆస్పత్రి సిబ్బంది హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రోగులకు అవసరమైన రక్త నమూనా పరీక్షలు సకాలంలో నిర్వహించి అవసరమైన మందులు అందించాలన్నారు. యాంటీబయోటిక్ మందులు, పాము కాటుకు సంబంధించిన వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

సమాజ సేవకు సమయం కేటాయించండి

జహీరాబాద్ టౌన్: ఉన్నతస్థాయిలో ఉన్నా సొంత ఊరిని మర్చిపోకుండా కొంత సమయం సమాజ సేవకు కేటాయించాలని టీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరామ్ రాథోడ్ అన్నారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని మల్చల్మ, విట్టు నాయక్ తండాలకు చెందిన తుకారాం రాథోడ్, శంకర్ చవాన్లు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించగా.. పట్టణంలోని బంజారా భవన్‌లో శనివారం వారిని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని కొనియాడారు. కష్టపడి చదివించిన తల్లిదండ్రులను, సొంత ఊరిని మర్చిపోవద్దని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

పటాన్‌చెరు: సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శనివారం అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీని కలిసి అమీన్‌పూర్‌లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలో అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... అమీన్‌పూర్ పరిధిలోని సమస్యలపై తాను ఎప్పటికప్పుడు సమాచారం తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమల రెడ్డి, కొండ లక్ష్మణ్, మహేశ్వర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, వెంకట పుల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళ లేనిదే సమాజం లేదు



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి లక్ష్మీశారద

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్‌జోన్: మహిళ లేనిదే సమాజం లేదని, ప్రస్తుత పోటీ ప్రపంచలో వంటింటి నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నారని జిల్లా జడ్జి లక్ష్మీశారద అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మెదక్‌లో కలం స్నేహం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ‘అతివ’ పాటల సీడీని ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలు చదువులో రాణిస్తూ ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే మహిళా సాధికారత సాధ్య మవుతుందన్నారు. ప్రభుత్వం అన్ని పథకాలలో మహిళలకు సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలం స్నేహం వ్యవస్థాపకుడు, సినీ సంగీత దర్శకులు శ్రీమాన్ గోపాల్ ఆచార్య, జాతీయ ప్రధాన కార్యదర్శి గీతాశ్రీ స్వర్గం ,కన్వీనర్ రాధిక, సంయుక్త కార్యదర్శి సరళ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రంలోని ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని వచ్చేసారి మరింతమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అంతకుముందు క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి దామోదర్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిణి సంతోష తదితరులు పాల్గొన్నారు.


1,500 కేసులు పరిష్కారం



జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు, సిబ్బంది

మెదక్‌జోన్/నర్సాపూర్: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా కోర్టులో పలువురు కక్షిదారులు రాజీ అయ్యారు. జిల్లావ్యాప్తంగా పలుకోర్టుల్లో 1,500 కేసులు పరిష్కారం అయ్యాయి. అలాగే పలు రకాల కేసులకు సంబంధించి బాధితులకు చెల్లించాల్సిన బీమా కంపెనీలతో పాటు ఇతర జరిమానాలు రూ. 46.32 లక్షలను కోర్టులో చెల్లించారు. ఈసందర్భంగా జిల్లా జడ్జి లక్ష్మీశారద మాట్లాడుతూ.. ఇరువురి మధ్య మనస్పర్థలు వస్తే కూర్చొని పరిష్కరించుకోవటం మంచిదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్ కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రుబీనా ఫాతిమా పాల్గొని మాట్లాడారు. కక్షిదారులు రాజీ పడడమే రాజమార్గమని అన్నారు. లోక్‌అదాలత్‌లో 137 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.

వేలాది కోళ్లు మృత్యువాత



గవ్వలపల్లిలో మరణించిన కోళ్లను గోతిలో పాతిపెడుతున్న దృశ్యం

చిన్నశంకరంపేట(మెదక్): అంతుచిక్కని వైరస్‌తో ఏడు వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. మండలంలోని గవ్వలపల్లికి చెందిన సంగెపు జనార్దన్ కోళ్లఫాంలో ఒక్క రోజే 6,264 కోళ్లు వరుసగా మృతి చెందాయి. వాటిని పొలం వద్ద గుంతతీసి పూడ్చినట్లు బాధితుడు తెలిపారు. 30 రోజుల పాటు ఫాంలో పెరిగిన కోళ్లు మృతి చెందాయని వాపోయాడు. అలాగే జంగరాయికి చెందిన భూపాల్‌రెడ్డి, యాదగిరికి చెందిన కోళ్లఫాంలో 1,200 కోళ్లు మృత్యువాత పడ్డాయి.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మహిళలతోనే కుటుంబాల ఎదుగుదల సాధ్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఖేడ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఇండోర్ ఆటలు, సంగీతం, నృత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు తన సతీమణి అనుపమారెడ్డితో కలిసి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్నిరంగాల్లోనూ ముందుండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, రమేష్ చౌహాన్, సంగన్న, శివరాథోడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఆయా శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశలు.. ఆవరి



నందగోకుల్‌లో నీరు అందక బీటలు వారిన వరి పంట



చిన్నగొట్టిముక్కలో పంటను పశువులు మేస్తున్న దృశ్యం

భూగర్భజలాలు అడుగంటాయి. వరి నాట్ల సమయంలో అధికంగా పోసిన బోర్లు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. చుక్క నీరు రాక గింజకడుతున్న వరిపైరు కళ్ల ముందే ఎండిపోతుంది. నీటి తడులు అందించలేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏం చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పచ్చని వరి చేన్లను జీవాలకు మేతగా వేశారు. చేతికి రావాల్సిన పంట ఇలా పనికి రాకుండా పోవడంతో గుండె పలిగి రోదిస్తున్నారు. నిజాంపేట మండలంలోని నందగోకుల్, నస్కల్, చల్మెడ, శివ్వంపేట మండల పరిధిలో చిన్నగొట్టిముక్కలో భూగర్భజలాలు అడుగంటి పంటలు పూర్తిగా ఎండుముఖం పట్టాయి. అయితే కొన్ని గ్రామాలకు కాళేశ్వరం నీరు కాలువల ద్వారా వస్తున్నాయని, తమ గ్రామాలకు సైతం నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

– నిజాంపేట(మెదక్)/శివ్వంపేట(నర్సాపూర్)

‘కేజీబీవీ’లో జీసీడీఓ విచారణ

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని కేజీబీవీలో బాలికలను చితకబాదినట్లు తల్లిదండ్రులు చేసిన ఆందోళనతో శనివారం గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి సుప్రియ విచారణ చేపట్టారు. విద్యాలయంలో గణితం టీచర్ సురేఖ బాలికలను పనులు చేయాలని బెదిరిస్తూ చితకబాదుతుందని తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని తల్లిదండ్రులు శుక్రవారం ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అయితే మరికొందరు విద్యార్థినులను సైతం చితకబాదినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న జీసీడీఓ ఎంఈఓ రహీమొద్దీన్‌తో కలిసి విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో వేర్వేరుగా మాట్లాడారు. విచారణ నివేదికను డీఈఓతో పాటు కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కో ఆర్డినేటర్ మాధవి, ఎస్ఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.



క్లుప్తంగా

బేగంపేట విద్యార్థిని ప్రపంచ రికార్డ్

8 సెకండ్ల 85 మిల్లీ సెకన్స్‌లో ఆవర్తన పట్టిక కంఠస్థం



ప్రశంసాపత్రం అందుకుంటున్న కార్తీక

దుబ్బాకటౌన్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్యం దిశగా ముందుకు సాగాలని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి అన్నారు. శనివారం చెన్నైలో జరిగిన ప్రపంచ పోటీల్లో పాఠశాలకు చెందిన పంజాల కార్తీక పాల్గొని ప్రపంచ రికార్డ్ కొట్టి గుర్తింపు పత్రం, అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 8వ తరగతికి చెందిన పంజాల కార్తీక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చెన్నైలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను 8 సెకండ్ల 85 మిల్లీ సెకండ్స్ లలో కంఠస్థం చేసినట్లు తెలిపారు. దీంతో ప్రపంచ రికార్డును సృష్టించిందన్నారు. ఈ విషయాన్ని కలామ్స్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించి కార్తీకకు గుర్తింపు ప్రశంసాపత్రంతో పాటు అవార్డు అందజేశారన్నారు. దీనికి కృషి చేసిన ఉపాధ్యాయుడు భాస్కర్ రెడ్డిని, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

చింతకాయలు తెంపుతూ కిందపడ్డ రైతు

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రాజిరెడ్డి (ఫైల్)

దుబ్బాకటౌన్: చెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన ఎంగారి రాజిరెడ్డి (52) వ్యవసాయం చేస్తూ భవన నిర్మాణ కార్మికుడి గా పని చేస్తున్నాడు. భార్య, పిల్లలతో జీవనం కొనసాగిస్తున్నాడు. 3న సొంత వ్యవసాయ పొలంలో చింత చెట్టు ఎక్కి కాయలను తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాజిరెడ్డిని సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి శనివారం రాజిరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక వాహనం పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లి శివారులోని మోయతుమ్మద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నామని ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. గ్రామానికి చెందిన ప్రశాంత్ శుక్రవారం రాత్రి వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా దాడిచేసి వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన తనిఖీల్లో 24 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో శనివారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.24,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కల్హేర్(నారాయణఖేడ్): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 92 మందికి రూ.1.05 లక్షలు జరిమానా విధిస్తూ నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శ్రీధర్ మంథని తీర్పు వెల్లడించినట్లు సిర్గాపూర్ ఎస్‌ఐ డి.వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. సిర్గాపూర్ మండలంలో ఇటీవల మద్యం తాగి వాహనాలు నడిపిన 92 మందిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

పర్యావరణహితుడు.. పక్షి ప్రేమికుడు

రకరకాల పక్షులు పెంచుతున్న మల్లాగౌడ్

రూ.వేలల్లో ఖర్చు చేసి ఇష్టంతో కొనుగోలు



రామచిలుక

కౌడిపల్లి(నర్సాపూర్): అతడి వృత్తి వ్యవసాయం, ఉద్యోగం లైన్‌మెన్.. అయినా సరే ఖాళీ సమయం దొరికితే చాలు పక్షులతో కాలక్షేపం చేస్తాడు. పక్షులంటే అతడికి అమితమైన ప్రేమ. ఎంత ఖర్చు అయినా వెనుకాడకుండా కొనేస్తుంటాడు. వాటి దాణా కోసం రూ.వేలల్లో ఖర్చు చేస్తాడు.

కంచన్‌పల్లి గ్రామానికి చెందిన మల్లాగౌడ్‌కు ఇంటి వద్ద చిన్న చిన్న జాలీలతో షెడ్స్ వేసి పక్షులను పెంచుతున్నాడు. ప్రస్తుతం అతడి దగ్గర కాక్‌టెల్ చిలుకలు 4, లవ్‌బర్డ్స్ 10, ఆఫ్రికన్ లవ్ బర్డ్స్ ఆరెంజ్ అండ్ గ్రీన్ 8, కాసులు 4, పావురాలు 10 జతలు, లక్కీపావురాలు 4 జతలు,, పందెం కోళ్ల పెట్టలు పుంజులతోపాటు కొమోరియన్ జాతి కుక్క, అక్వేరియం ఉన్నాయి. వివిధ రకాల పక్షులకు ఒక్కో జత రూ.1,000 నుంచి రూ.5 వేల వరకు ధర చెల్లించి కొనుగోలు చేశాడు. ఇలా కొన్నేళ్లగా పక్షులను పెంచుతున్నాడు. పక్షులంటే ప్రాణం అని అందుకే రూ.లక్షలు ఖర్చుచేసి వాటిని కొనుగోలు చేస్తున్నాడు.

హైదరాబాద్ నుంచి దాణా

పక్షుల కొనుగోలుకు రూ.లక్షలు ఖర్చు చేయగా వాటి పెంపకం, పోషణకు ప్రతి నెలా రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు చేస్తుంటాడు. హైదరాబాద్ మక్కా మజీద్ పక్కన మినార్ బర్డ్స్ మార్కెట్ నుంచి పక్షులను కొనుగోలు చేసి అక్కడి నుంచే వాటికి దాన సైతం ప్రతి నెలా తెస్తాడు. వీలు కాని సమయంలో సంగారెడ్డి జిల్లా జోగిపేట నుంచి దాణా తీసుకొస్తాడు. పక్షుల దాణాకు గాను



ఆఫ్రికన్ లవ్‌బర్డ్

కొర్రలు, సజ్జలు, రాగులు, సన్‌ఫ్లవర్, స్వీట్ కార్న్, కుసుమలు కొనుగోలు చేసి వాటికి పెడతాడు.

ప్రత్యేక షెడ్స్ ఏర్పాటు

పక్షులు పెంచేందుకు గాను ప్రత్యేకంగా ఇంటి ఆవరణలో కొద్ది స్థలంలోనే వాటికి జాలీలతో షెడ్స్ ఏర్పాటు చేశాడు. వాటిలో పక్షులకు సౌకర్యంగా ఉండేందుకు కుండలు, చెక్కలతో తయారు చేసిన పెట్టెలు ఏర్పాటు చేశాడు. అందులోనే దాణా



పందెం కోడి

వేస్తాడు. ప్రతిరోజూ దాణా వేస్తూ నీళ్లు పోస్తాడు. నాలుగు అయిదు రోజులకు ఒకసారి వ్యర్థాలను శుభ్రం చేస్తాడు. పొరపాటున షెడ్ జాలీ డోర్ ఊడి



ఇంటి వద్ద చిన్నపాటి షెడ్డులో పక్షులు



బాతులు (కాసులు)



లవ్‌బర్డ్స్

ఇష్టంతో పెంచుతాం

పక్షులంటే తనకు ప్రాణం. వ్యవసాయంతో పాటు లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తా. సుమారు ఇరవై ఏళ్లుగా వాటిని పెంచుతున్నా. హైదరాబాద్ మినార్ బర్డ్స్ మార్కెట్ నుంచి పక్షులను కొనుగోలు చేస్తా. ఒక్కో రకం పక్షి జతకు రూ .1,000 నుంచి రూ.5,000 వరకు ఉంటుంది. ఉదయం, సాయంత్రం వాటితో గడుపుతా. మిగితా సమయంలో కుటుంబ సభ్యులు



చూస్తారు. పక్షులంటే ఇష్టం కాబట్టి ఖర్చుకు వెనుకాడను.

- మల్లాగౌడ్, కంచన్‌పల్లి

పోతే పక్షులు ఎగిరిపోయి తిరిగి రావని అలా వెల్లినవి బయట ఎక్కువ రోజులు బతకలేవని మల్లా గౌడ్ చెప్పాడు. వేసవి కాలంలో ఎక్కువగా పక్షులు చనిపోతుంటాయి. వాటి రక్షణకు ఎంత చల్లదనం ఏర్పాటు చేసిన కొన్నిసార్లు చనిపోతాయి. దీంతో తిరిగి కొనుగోలు చేస్తానని చెప్పాడు. ఇక పందెం కోళ్లు, కాసులు, పావురాలు బయటకు వదిలితే చెట్ల నీడన ఇంటి ఆవరణ, చుట్టుపక్కల తిరిగి వస్తాయి. కొమోరియన్ కుక్కతో పాటు అక్వేరియం ఉంది.

స్పేస్ సెంటర్‌ను సందర్శించిన విద్యార్థులు



స్పేస్ సెంటర్ వద్ద విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులు, బోధనా సిబ్బంది సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్(శ్రీహరికోట)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ విభాగాధిపతి డా. సీహెచ్ మధుసూదన్ మాట్లాడుతూ.. ఇది ఇస్రో నిర్వహణలో ఉన్న ఉపగ్రహ ప్రయోగకేంద్రమని, ఏపీలోని పులికాట్ సరస్సు, బంగాళాఖాతం నడుమ శ్రీహరికోట అనే ద్వీపంలో 175 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నట్లు చెప్పారు. మొదట్లో షార్‌గా పిలువబడిన దీనిని 2002 నుంచి మాజీ ఇస్రో చైర్మన్ సతీష్‌ధావన్ పేరుతో పిలుస్తారన్నారు. ఇందులో రెండు లాంచ్ ప్యాడ్‌లు ఉన్నాయని వీటి ద్వారా మన దేశం పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగ కార్యకలాపాలను నిర్వహిస్తుందని వివరించారు. ఈ క్షేత్ర పర్యటన ద్వారా లాంచ్ ప్యాడ్‌ల టెక్నాలజీ, రాకెట్ వివిధ దశల ప్రయోగాల టెక్నాలజీ తదితర అంశాలను గురించి విద్యార్థులు చక్కగా తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పర్యటనలతో విద్యార్థుల్లో శాస్త్రీయదృక్పథం అలవడుతుందన్నారు. ఈ కేంద్రంలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ వీ. సురేందర్ తమకు ఎంతగానో సహకరించాడని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేందర్ కళాశాల అధ్యాపకులకు జ్ఞాపికను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.భాస్కర్, సత్యనారాయణరెడ్డి, డా.మహేశ్‌కుమార్, డా.మనోహర్, డా.భైరయ్య, డా.లీలావతి, డా.రాణి, వెంకటరమణ, కృష్ణయ్య, డా.పుణ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

- పట్టుకొని దేహశుద్ధి చేసిన స్థానికులు
- ఇద్దరిని పోలీసులకు అప్పగింత

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు పక్కన కల్లు విక్రయిస్తున్న మహిళపై దాడి చేసి మెడలోని పుస్తెలతాడు అపహరించేందుకు యత్నించాడు ఓ వ్యక్తి. దీంతో స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన హత్నూర మండలం నాగారం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. నాగారం గ్రామానికి చెందిన చిప్పల్ తుర్తి సుగుణ కొంతకాలంగా గ్రామ సమీపంలో వడ్డేపల్లి సోలక్‌పల్లి ప్రధాన రోడ్డు పక్కన కల్లు విక్రయిస్తుంది. శనివారం మధ్యాహ్నం కల్లు విక్రయిస్తుండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి రెండు సీసాల కల్లు కావాలని అడిగారు. డబ్బాలో కల్లు నింపుతుండగా బైక్ పైనుంచి దిగిన వ్యక్తి మహిళపై దాడి చేసి నాలుగు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించారు. మహిళ అరుపులు విన్న స్థానికులు అప్రమత్తమై వారిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం ఇద్దరిని పోలీసులకు అప్పగించారు.

ఒకే రోజు మామ, కోడలు మృతి

మక్కరాజీపేటలో విషాదం



పోచయ్య



సుమలత

చేగుంట(తూప్రాన్): ఒకే రోజు మామ, కోడలు మృతి చెందిన విషాదకర ఘటన మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మక్కరాజీపేట గ్రామంలో వారం రోజుల కిందట ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆరెల్ల సుమలత(35) పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం సుమలతను గజ్వేల్ తరలిస్తున్న క్రమంలో దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి శివారులో అంబులెన్స్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న సుమలత మామ ఆరెల్ల పోచయ్య(65)కు తీవ్ర గాయాలయ్యాయి. కోమాలోకి వెళ్లిన పోచయ్యను లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి, సుమలతను తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న పోచయ్య శనివారం మృతి చెందాడు. మామ మరణ వార్త విన్న సుమలత తీవ్ర అస్వస్థతకు గురై గుండెపోటు రావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఒకే కుటుంబంలో గంటల వ్యవధిలోనే మామ, కోడలు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతురాలు సుమలతకు కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

సంగారెడ్డి: ఆర్థిక ఇబ్బందులతో రిటైర్డ్ ఉద్యోగి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చౌటకూర్ మండలం బొమ్మరెడ్డి గూడెంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రాంతి కుమార్ కథనం మేరకు.. బొమ్మారెడ్డి గూడెంకు చెందిన మూడ్ తుకారం (65) ఒడీఎఫ్ రిటైర్డ్ ఉద్యోగి. ప్రస్తుతం సంగారెడ్డిలో నివాసం ఉంటున్నాడు. ఇతడికి ఐదుగురు ఆడపిల్లలు కాగా ముగ్గురికి వివాహం చేశాడు. మిగితా ఇద్దరి వివాహ విషయంలో ఆర్థిక ఇబ్బందులు నెలకొని కుటుంబంలో కలహాలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెంది శనివారం బొమ్మరెడ్డి గూడెంలో చెట్టుకి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి భార్య మంగ్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని కార్మికుడు..

హత్నూర(సంగారెడ్డి): ఉరేసుకొని కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హత్నూర మండల పరిధిలోని బోరుపట్ల గ్రామంలో శనివారం వెలుగు చూసింది. హత్నూర ఎస్‌ఐ సుభాష్ కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బనేశ్వర్ ముర్మ (22) రెండుళ్లుగా బోరపట్ల గ్రామ శివారులోని ఆపెటోరియ యూనిట్-1లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అదేవిధంగా తోటి కార్మికులతో కలిసి పరిశ్రమకు సమీపంలోని గదిలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం కార్మికులు ఎవరి గదిలో వారు నిద్రించారు. శనివారం ఉదయం షిఫ్ట్ డ్యూటీ కి వెళ్లాల్సి ఉండగా బనవేశ్వర్ గదిలో నుంచి బయటికి రాకపోవడంతో తోటి కార్మికులు తలుపు తెరిచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి దగ్గరి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కాళ్లకల్ గ్రామంలో యువకుడు



వేణు(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామానికి చెందిన బాలగొని శ్రీనివాస్‌గౌడ్, జయమ్మ దంపతులకు కుమారుడు వేణు(23), కూతురు ఉంది. కుటుంబ సభ్యులంతా కలిసి కొన్నేళ్లుగా మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామంలో నివాసం ఉంటూ సాగర్ ఏషియా పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వేణు స్థానిక ఓ ప్రైవేట్ పరిశ్రమలో డ్యూటీ చేస్తున్నాడు. కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పరిశ్రమకు వెళ్లగా వేణు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

వ్యాన్‌ను ఢీకొట్టడంతో 8 మందికి గాయాలు

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన కుకునూరు పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. 6న హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి ఒకే కుటుంబానికి చెందిన తోడి సుధాకర్, జ్యోతి, బాలమ్మ, మనీల, శ్రీలత, రేణుక, యాదగిరి, ప్రభాకర్ కలిసి టెంపో వ్యాన్‌లో జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ దేవాలయం వద్ద బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చిన్న కిష్టాపూర్ గ్రామ శివారులోకి రాగానే కారు అతివేగంగా వచ్చి టెంపోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. శనివారం తోడి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కారు డ్రైవరు మెదక్ జిల్లా మాసాయిపేటకు చెందిన చిట్యాల రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నువ్వులు.. లాభాల సిరులు

వేసవిలో ఆరుతడి కింద సాగు

- ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశాలు
- సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- రైతులకు ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ సూచనలు, సలహాలు

మిరుదొడ్డి(దుబ్బాక): వేసవిలో ఆరుతడి కింద సాగు చేసే నువ్వుల పంట సిరులను కురిపిస్తుంది. నువ్వుల సాగు వర్షాధారం కంటే వేసవిలోనే ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశాలు ఉండటంతో రైతులు సాగు వైపు మొగ్గు చూపిస్తున్నారు. నువ్వుల నూనెకు మార్కెట్‌నూ మంచి డిమాండ్ పలుకుతోంది. నువ్వుల్లో విటమిన్లు, అమైనో ఆమ్లాలు కలిగి ఉంటాయి. ఆయుర్వేద మందుల్లో నువ్వుల నుంచి లభించే నూనెను వాడుతుండటం విశేషం. తక్కువ సమయంలో, తక్కువ నీటి వనరులతో ప్రస్తుతం వేసవిలో ఏక వార్షిక పంటగా నువ్వులను సాగు చేయడం వల్ల మంచి దిగుబడులు వస్తాయని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనిల్ కుమార్ చెబుతున్నారు. నువ్వుల సాగుపై ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు.

- **నేలలు:** తేమ కలిగిన తేలికైన నేలలు అనుకూలంగా ఉంటాయి.
- **నేల తయారు చేసుకునే విధానం:** నేలను నాలుగు సార్లు మెత్తగా దున్నుకొని రెండు సార్లు గుంటకతో చదును చేసుకోవాలి.
- **విత్తుకునే విధానం:** ఎకరానికి రెండున్నర కిలోల విత్తనాలు సరిపోతాయి. విత్తనానికి మూడింతల ఇసుక కలుపుకొని గొర్రు సహాయంతో వచ్చే వరుసల్లో విత్తుకోవాలి.



అనిల్ కుమార్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి, సిద్దిపేట

- **విత్తనాల్లో రకాలు:** హిమ, చందన, మాధవి, రాజేశ్వరి, శేతాతిల్, ఎలమంచిలి11, 17, 66, గౌరి అనే రకాలు ఉన్నాయి.
- **ఎరువులు వేసుకోవడం:** ఎకరానికి నాలుగు టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్, 16 కిలోల నత్రజనిని దుక్కిలో వేసుకొని కలియ దున్నుకోవాలి. విత్తిన నెల రోజులకు కలుపు తీసిన తర్వాత 8 కిలోల నత్రజనిని వేసుకోవాలి.
- **నీటి తడులు:** విత్తనాలను చల్లుకున్న అనంతరం నీటి తడిని ఇవ్వాలి. పూత, కాత, గింజలు కట్టే దశలో నీటి తడులను అందించాలి. విత్తిన తర్వాత 35 నుంచి 40 రోజులు, తర్వాత 65 నుంచి 70 రోజుల వరకు నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు

- **రసం పీల్చే పురుగులు:** ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేస్తాయి. ఆకులు దోనే ఆకారంలో వాలిపోతాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి. లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **కాయ తొలుచు పురుగులు:** లేత ఆకులను గూడు కట్టి పచ్చని పదార్థాన్ని గీకి తినడం వల్ల ఆకులు ఎండిపోతాయి. పూతతో పాటు, లేత గింజలను తినడం వల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వీటి నివారణకు క్లోరిపైరిపాస్ 2.5 మిల్లీ లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.



నువ్వుల సాగు

- **కోడు ఈగ:** మొగ్గలను, పూతను తినడం వల్ల తాలు కలిగిన కాయలు ఏర్పడతాయి. వీటి నివారణకు ఎసిఫేట్ 1 గ్రామ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **గొంగళి పురుగులు:** ఆకుల్లోని పత్రహరితాన్ని తినడం వల్ల ఆకులు జల్లెడలా మారుతాయి. మొగ్గలను, పువ్వులను, తినడంతోపాటు కాయలకు రంధ్రాలు చేసి విత్తనాలను తింటాయి. వీటి నివారణకు ఎండోసల్ఫాన్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్ల నివారణ

- **వేరు కుళ్లు, కాండం తెగుళ్లు:** ఆకులు పసుపు వర్ణానికి మారి వేలాడుతాయి. దీని నివారణకు పంట మార్పిడి చేయాలి. కిలో విత్తనానికి 3 గ్రామ్ థైరంతో విత్తన శుద్ధి చేయాలి. మాంకోజెబ్ 3 గ్రామ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **ఆకు మచ్చ తెగులు:** ఆకులు, కాండంపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడుతాయి. ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన అవశేషాలను తొలగించాలి. మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయాలి.
- **కాండం తెగులు:** కాండంపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడి క్రమంగా నల్లగా మారుతాయి. దీని నివారణకు కాఫర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- **పంట కోత విధానం:** ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోయే సమయంలో కాయలు లేత పసుపు వర్ణానికి మారినప్పుడు కోత కోసుకోవాలి. కోసిన పంటను కట్టలుగా కట్టి తలకిందులుగా నిలబెట్టాలి. ఆరు రోజుల పాటు ఆరబెట్టుకోవాలి. కట్టెలతో కొట్టి నూర్పిడి చేసుకోవాలి.
- **నిల్వ చేసుకునే విధానం:** గింజల్లోని తేమ 8 శాతం తగ్గే వరకు ఎండలో ఆరబెట్టుకోవాలి. నిలువ ఉంచుకున్న గోనె సంచులపై మాలథియాన్ పొడిని చల్లుకోవాలి. విక్రయానికి మంచి ధర పలికినప్పుడు మార్కెట్‌కు తరలించి ఆర్థికాదాయాన్ని పొందాలి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జాగ్రు మంజ (ఫైల్)

మునిపల్లి(అందోల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జాగ్రు మంజ (47) శనివారం మండలంలోని లింగంపల్లి గ్రామ శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై నడుచు కుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి శరీరంపై నుంచి వాహనం వెళ్లడంతో మాంస పు ముద్దలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. దీపక్‌కుమార్ సింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపారు.

బట్టల వ్యాపారి

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో బట్టల వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని పోతారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. రాజన్నసిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కేదారి ముత్తయ్య(75)గ్రామంలో బట్టలు అమ్ముతూ ఉండేవాడు. శుక్రవారం బట్టలు కొనుగోలు చేసేందుకు దుబ్బాకకు వచ్చి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతడిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.